క్లుప్తంగా

పంట రుణాలు రెన్యూవల్ చేసుకోవాలి

కందుకూరు: కందుకూరు పీఏసీఎస్‌లో స్వల్ప కాలిక పంట రుణాలు తీసుకున్న సభ్యులు 7శాతం వడ్డీతో ఈ నెల 28లోపు చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సకాలంలో చెల్లించిన సభ్యులకు ప్రభుత్వం ద్వారా 3శాతం వడ్డీ రాయితీ తిరిగి చెల్లిస్తామన్నారు. ఆఖరు తేదీ తర్వాత పంట రుణాలపై 13.75 శాతం వడ్డీ వర్తిస్తుందన్నారు. దీర్ఘకాలిక అప్పులు తీసుకున్న సభ్యులు 2024లో చెల్లించాల్సిన వాయిదాలను ఈ నెల 28లోపు చెల్లించాలని సూచించారు. వాయిదా సమయం దాటితే లీగల్ చర్యలు తీసుకోవాల్సి వస్తుందని తెలిపారు. 2025 సంవత్సరానికి సంబంధించిన వాయిదాలను మార్చి 15లోపు చెల్లించాలని సూచించారు. ఆ తర్వాత అపరాధ వడ్డీ విధించబడుతుందని పేర్కొన్నారు. వడ్డీ రాయితీ పొందేందుకు, అదనపు వడ్డీ భారం మోయకుండా ఉండేందుకు సభ్యులు నిర్ణీత గడువులోపు రుణాలను చెల్లించాలని కోరారు.

ఇన్‌చార్జి అధికారికి శుభాకాంక్షలు



శ్రీనివాస్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌ల ఐదేళ్ల పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వం కార్పొరేషన్, మున్సిపాలిటీలకు ప్రత్యేకాధికారులను నియమించింది. కాగా గురువారం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌కు ప్రత్యేక ఇన్‌చార్జిగా వచ్చిన శ్రీనివాస్‌రెడ్డిని సచివాలయంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ మేయర్ చిగురింత పారిజాత కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బడంగ్‌పేట కార్పొరేషన్ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

బీటీరోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న గ్రామస్తులు

కందుకూరు: మండల పరిధిలోని గుమ్మడవెల్లి నుంచి గుమ్మడవెల్లితండా వరకు ఉన్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం గ్రామస్తులు కాంట్రాక్టర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తండావాసులు మాట్లాడుతూ.. 2024లో సబితారెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో రహదారి నిర్మాణానికి రూ.80లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. పనులు చేపట్టడానికి సహకరించిన ఎమ్మెల్యేతో పాటు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వానికి తండా తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కె.దేవీలాల్‌నాయక్, మాజీ సర్పంచ్‌లు భద్రయ్య, మస్కు బాబు, నాయకులు ఏకుల మల్లేశ్, రాజునాయక్, గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



పూలు, చాదర్ తీసుకొస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

పహాడీషరీఫ్‌లోని బాబా షర్ఫుద్దీన్ దర్గాను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి గురువారం దర్శించుకున్నారు. ఉర్సు ఉత్సవాల్లో భాగంగా దర్గాకు విచ్చేసిన ఆమె బాబాకు పూలు, చాదర్‌ను సమర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా దర్గా నిర్వాహకులు ఆమెను సత్కరించి, జ్ఞాపిక అందజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కె.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ విజయపురి ఫీడర్ పరిధి కాలనీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, 11కేవీ హనుమాన్‌నగర్, గొటేటి ఫంక్షన్‌హాల్, సాయినగర్ ఫీడర్ల కింది కాలనీలలో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు, సమతాపురి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, 11కేవీ వీగార్డ్ ఫీడర్ కింది కాలనీలలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని అధికారి పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.



అసంపూర్తిగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌యార్డు నిర్మాణం

నిధులు లేక.. పనులు సాగక!

- పిల్లర్ల దశలోనే 'నాన్‌వెజ్ బ్లాక్'
- పట్టించుకోని అధికారులు
- ప్రస్తుత ప్రభుత్వంపై ఆశగా ఎదురుచూపు

నాలుగేళ్లుగా అసంపూర్తిగానే దర్శనమిస్తున్న మార్కెట్‌యార్డు నిర్మాణం



పిల్లర్ల దశలో నాన్‌వెజ్ బ్లాకు నిర్మాణ పనులు

శంకర్‌పల్లి: పండ్లు, కూరగాయలు, మాంసం ఇలా అన్ని ఒకేచోట విక్రయాలు సాగేలా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌యార్డు నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. అయితే ఆ పనులు నిధుల లేమితో అర్ధంతరంగా ఆగిపోయాయి. నిర్మాణానికి కేటాయించిన రూ.2కోట్ల నిధులు ప్రస్తుత ప్రభుత్వం అందించకపోవడమే కారణమని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడంతో జరిగిన నిర్మాణ పనులు ఆదిలోనే శిథిలావస్థలోకి వెళ్లే పరిస్థితి కన్పిస్తోంది. పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌యార్డు నిర్మాణ పరిస్థితి ఇది.

2021 జూన్‌లో శంకుస్థాపన..

సామాన్యులకు, వ్యాపారులకు అన్ని సదుపాయాలు కల్పించి, కొనుగోళ్లు పెంచే ఉద్దేశంతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌యార్డు నిర్మాణాలను చేపట్టింది. దీన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లో ప్రారంభించింది. పట్టణంలో 30 గుంటల భూమిలో 2021 జూన్‌నెలలో నాటి విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి రూ.2కోట్ల రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌యార్డు పనులకు శంకుస్థాపన చేసింది. రెండేళ్లలో పూర్తి కావాల్సిన పనులు నాలుగేళ్లు కావొస్తున్నా ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించి పనులు పూర్తి చేసి మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకొస్తుందని స్థానికులు, రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

రెండు బ్లాకులుగా నిర్మాణాలు..

శంకర్‌పల్లి పట్టణంలో నిర్మించే ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌యార్డుని వెజ్ బ్లాకుగా ఒకటి, మరొకటి అండ్ నాన్‌వెజ్ బ్లాకుగా విభజించారు. అయితే ఈ రెండు బ్లాకులలో సుమారు 80 నుంచి 100 యూనిట్లు వచ్చే అవకాశం ఉంది. వీటిని పండ్లు, కూరగాయలు, మాంసం విక్రయదారులకు కేటాయిస్తారు. అయితే 2021 జూన్‌లో శంకుస్థాపన అయినప్పటి నుంచి వెజ్ బ్లాకులో ఒక అంతస్తు నిర్మాణం చేపట్టి.. మరొక అంతస్తు నిర్మాణం పెండింగ్‌లో ఉంది. అదే నాన్‌వెజ్ బ్లాకులో మాత్రం పిల్లర్ల దశలోనే ఆగిపోయాయి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున గడ్డి, చెత్తా, చెదారం నిండి, పశువులు, శునకాలకు ఆవాసంగా మారింది.

ఎకరా స్థలం లేని మున్సిపాలిటీ..

పట్టణంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు నిర్మాణానికి మున్సిపాలిటీ అధికారులు, ప్రజాప్రతినిధులకు మొదటినుంచి అడ్డంకులే వచ్చాయి. దానికి గల ప్రధాన కారణం శంకర్‌పల్లి మున్సిపాలిటీకి ఒక ఎకరా ప్రభుత్వ స్థలం కూడా లేకపోవడమే. దీంతో మార్కెట్‌యార్డు నిర్మించేందుకు అధికారులకు పెద్ద తలనొప్పిగా మారింది. అప్పటి మంత్రి సబితారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలోని 30గుంటల భూమిని కేటాయించారు. అయితే ఈ స్థలాన్ని మున్సిపాలిటీకి అప్పగించే సమయంలోనూ ఆర్‌అండ్‌బీ అధికారులు కాస్తా ఇబ్బందికర పరిస్థితులకు గురిచేశారు.

ట్రాఫిక్‌తో ఇబ్బందులు

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌యార్డు నిర్మాణ పనులు పూర్తయితే పట్టణ వాసులకు భారీ స్థాయిలో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగుతాయి. ప్రస్తుతం పట్టణంలో జరిగే మార్కెట్ అంతా మా ఇంటి పరిసరాల్లోనే జరుగుతుంది. నిత్యం ట్రాఫిక్‌తో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు చొరవ తీసుకొని త్వరతగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి.
– దయాకర్‌రెడ్డి, శంకర్‌పల్లి

ఆదేశాల కోసం చూస్తున్నాం

మార్కెట్ యార్డు నిర్మాణ స్థితి గతులపై జిల్లా కలెక్టర్ పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం మార్కెట్ యార్డు నిర్మాణాల కోసం నిధులేమి కేటాయించలేదు. ప్రభుత్వం నిధులు కేటాయించగానే.. మిగిలిన పనులపై అంచనా వేసి టెండరు వేస్తాం.
– యోగేశ్, మున్సిపల్ కమిషనర్, శంకర్‌పల్లి

గ్రామీణ రోడ్ల అభివృద్ధికి కృషి

- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ప్రశాంత్‌రెడ్డి



పనులు ప్రారంభిస్తున్న నాయకులు, గ్రామస్తులు

మహేశ్వరం: గ్రామీణ ప్రాంత రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అమనగంటి ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామంలో నిలిచిపోయిన బీటీరోడ్డు నిర్మాణ పనులను గురువారం ఆయన పునప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తుమ్మలూరు–మహేశ్వరం మండల కేంద్రం వరకు గల బీటీ డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు నిధులు విడుదల కాకపోవడంతో పనులు నిలిచిపోయాయని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ ప్రత్యేక చొరవతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి, పనులు చేయించారని తెలిపారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయకుండా కాలయాపన చేసిందని ఆరోపించారు. రోడ్డు నిర్మాణ పనుల్లో చొరవ తీసుకున్న కేఎల్లార్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్, మాజీ సర్పంచ్ మద్ది కరుణాకరరెడ్డి, పార్టీ నాయకులు మహేందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, దానయ్య, సంగారెడ్డి, మహబూబ్, అంజయ్య, కృష్ణ, శేఖర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు



మ్యాన్‌హోళ్లలో పేరుకుపోయిన మురుగును తొలగిస్తున్న సిబ్బంది

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు ఎప్పటికప్పుడూ చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింతకింది నవీన్‌గౌడ్ కోరారు. గ్రామంలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను మున్సిపల్ సిబ్బందితో కలిసి గురువారం పరిష్కరించారు. కొన్ని బస్తీ రహదారులపై పేరుకుపోయిన మట్టి వ్యర్థాలను డోజర్‌తో శుభ్రం చేయించి, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా నవీన్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం పాలకమండలి లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజాసంక్షేమ పాలన



పార్టీలో చేరిన వారితో మధుసూదన్‌రెడ్డి తదితరులు

- గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

షాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమ పాలన కొనసాగిస్తోందని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని తాళ్లపల్లి గ్రామ మాజీ సర్పంచ్ సమ్మి పెంటయ్య, మారుగళ్ల నర్సింలు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్టీకి కార్యకర్తలే బలమని, బలోపేతానికి నిరంతరం పనిచేయాలని సూచించారు. గత పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ అవినీతి పాలనకు కేంద్రంలో బీజేపీ అండగా నిలిచిందన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు రెండు ఒక్క తాను ముక్కలేనని ఢిల్లీలో దోస్తీ, గల్లీలో లొల్లి చేస్తూ నాటకాలు చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల అమలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, మాజీ సర్పంచ్‌లు మహేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, బార్ల యాదయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అతిథిగృహాన్ని వినియోగంలోకి తీసుకురావాలి

- బీజేపీ మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డి



అతిథి గృహాన్ని పరిశీలిస్తున్న నాయకులు

చేవెళ్ల: ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన చేవెళ్లలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహాన్ని(గెస్ట్ హౌస్‌ను) మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని బీజేపీ మండల అధ్యక్షుడు అత్తెల్లి అనంత్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన బీజేపీ యువ నాయకులు డాక్టర్ వైభవ్‌రెడ్డితో కలిసి శిథిలావస్థలో ఉన్న చేవెళ్ల ఆర్‌అండ్‌బీ అతిథి గృహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో ఎంతో మంది ప్రముఖులు, అధికారులు, నాయకులకు ఆతిథ్యం అందించిన ఈ వసతిగృహాన్ని ఇప్పుడు పట్టించుకునేవారు కరువయ్యారన్నారు. నిజాం కాలంలో ఆనాడు నిజాం ప్రభువు గుర్రపు స్వారీపై వెళ్తూ మధ్యలో సేద తీరేందుకు కట్టించుకున్న ఈ భవనమే ఆ తర్వాత ఆర్‌అండ్‌బీ పరిధిలో గెస్ట్‌హౌస్‌గా కొనసాగుతూ వచ్చిందన్నారు. ఇన్నేళ్ల ఈ ప్రభుత్వాల పాలనలో కొత్తగా ఎలాంటి గెస్ట్‌హౌస్ కట్టకపోగా ఉన్న దానిని నిరుపయోగంగా మార్చారని మండిపడ్డారు. చేవెళ్ల అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రంలో ఎవరైనా ప్రముఖులు వస్తే కనీసం ఆతిథ్యం ఇచ్చేందుకు గెస్ట్‌హౌస్ అనేది లేకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. చేవెళ్ల హెడ్‌క్వార్టర్‌లోనే గెస్ట్‌హౌస్‌కు ఇలాంటి పరిస్థితి ఉంటే ఇది ప్రభుత్వ పాలన తీరుకు అద్దంపడుతుందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి గెస్ట్‌హౌస్‌ను బాగు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని, పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో నూతన భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జయసింహారెడ్డి, మచ్చేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మచ్చేందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కళాశాల నిర్మాణానికి విరాళం

షాద్‌నగర్: దాతల సహకారంతో షాద్‌నగర్ పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి గురువారం వేంకటేశ్వర హార్చరీస్ సంస్థ సభ్యులు రూ.25లక్షల భారీ విరాళాన్ని ప్రకటించారు. ఈ మేరకు సంస్థ జనరల్ మేనేజర్ కేజీ ఆనంద్, ఫైనాన్షియల్ మేనేజర్ శ్రీనివాసరావు విరాళానికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చెంది తిరుపతిరెడ్డి, అల్వాల్‌రెడ్డి, రవికుమార్, లింగారెడ్డిగూడ అశోక్ తదితరులు ఉన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి చేస్తాం

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, బీసీ సేనా జిల్లా అధ్యక్షుడు పాండుగౌడ్



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

చేవెళ్ల: ప్రభుత్వ సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, బీసీ సేనా జిల్లా అధ్యక్షుడు జూలూరి పాండుగౌడ్ అన్నారు. మండలంలోని కుమ్మెర గ్రామంలో గురువారం రూ.15లక్షల నిధులతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను గ్రామస్తులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని సమస్యలను పరిష్కరించేందుకు తమవంతు కృషి చేస్తున్నామన్నారు. సీసీరోడ్ల కోసం ఎమ్మెల్యే కాలె యాదయ్య సహకారంతో నిధులు మంజూరయ్యాయన్నారు. గ్రామాభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకొచ్చి గ్రామంలో సమస్యలు లేకుండా చేస్తామన్నారు. అన్ని కాలనీల్లో సీసీరోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణాలు పూర్తి చేయిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కావలి శంకర్, పంచాయతీ కార్యదర్శి కరుణాకర్, గ్రామస్తులు వీరేశం, రాంచందర్, కృష్ణ తదితరులు ఉన్నారు.

పారిశుధ్యం.. అస్తవ్యస్తం

- మొయినాబాద్‌లో రోడ్డుపైనే పారుతున్న మురుగునీరు
- దుర్వాసన, దోమలతో ఇబ్బంది పడుతున్న స్థానికులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



రోడ్డు పక్క నుంచి పారుతున్న మురుగునీరు

మొయినాబాద్: మొయినాబాద్ మున్సిపాలిటీలో మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. సరైన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే పారుతోంది. మున్సిపల్ కేంద్రంలోని భరద్వాజ్ కాలనీ, సహారా కాలనీ, విజయనగర్ కాలనీల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు ఏర్పాటు చేయలేదు. ఆయా కాలనీల లేఅవుట్ చేసినప్పుడే వెంచర్ చేసినవారు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్లు వేయాల్సి ఉన్నా అప్పట్లో అవేవి పట్టించుకోలేదు. లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్న తర్వాత ఇబ్బందులు మొదలయ్యాయి. ఆయా కాలనీల్లో గత ఐదేళ్లలో కొత్తగా ఇళ్ల నిర్మాణాలు అధికంగా జరిగాయి. ఆ ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరంతా రోడ్లపైన, రోడ్ల పక్క నుంచి కాలువలుగా పారుతోంది. దీంతో దుర్వాసన, ఈగలు, దోమలతో రోగాలు వస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ కేంద్రంలోనే ఇంత అధ్వాన పరిస్థితి ఉన్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగునీటి వ్యవస్థ సరిచేయాలని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

‘సిరిపురం’ త్యాగం మరువలేనిది



మహేశ్వరం గేటు వద్ద యాదయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



హుడాకాంప్లెక్స్: కొత్తపేటలో..

- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు భాస్కర్‌రెడ్డి

మహేశ్వరం: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఆత్మబలిదానం చేసిన సిరిపురం యాదయ్య త్యాగం మరువలేనిదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. యాదయ్య వర్ధంతి సందర్భంగా గురువారం మహేశ్వరం గేటు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఉస్మానియా యూనివర్సిటీ గేటు వద్ద ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మార్పణ చేసుకున్నారని తెలిపారు. ఆయన మరణం తర్వాత తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున లేసిందన్నారు. యాదయ్య మహేశ్వరం మండలం నాగారం గ్రామ వాసి కావడం గర్వకారణమన్నారు. ఆయన త్యాగం వృథా కాకుండా సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీసెల్ రాష్ట్ర కన్వీనర్ నందిగామ నర్సింహ, ఎస్టీసెల్ మండల మాజీ అధ్యక్షుడు నేనావత్ రాజు నాయక్, శివగంగ ఆలయ చైర్మన్ అల్లె కుమార్, నాయకులు అందుగుల సత్యనారాయణ, శివగళ్ల యాదయ్య, శివ యాదవ్, హరికృష్ణ, దుర్గప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో..

హుడాకాంప్లెక్స్: తెలంగాణ మలిదశ ఉద్యమంలో అమరుడైన సిరిపురం యాదయ్య వర్ధంతి సందర్భంగా గురువారం కొత్తపేట చౌరస్తాలో ఆయన విగ్రహానికి పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మధుయాష్కీగౌడ్, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి, చిలుక ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.